క్లుప్తంగా

అన్నాకు దసరా ఉత్సవాల ఆహ్వానం



అన్నా రాంబాబుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

మార్కాపురం టౌన్: దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ కంభం శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థానం కమిటీ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ అన్నా రాంబాబుకు ఆహ్వాన పత్రాలు శనివారం అందించారు. కంభంలో జరిగే వాసవీమాత ఉత్సవాలకు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

రైతు ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు

పొదిలి రూరల్: పంట పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం శనివారం పీఎం కిసాన్ పథకం ద్వారా ఒక్కో రైతుకు రూ. 2 వేలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని వ్యవసాయాధికారి ఎకే జైన్‌లాబ్దిన్ తెలిపారు. ఈ ఏడాది రెండో విడతగా సాయం అందించారన్నారు. పొదిలి మండలంలో మొత్తం 8,146 మంది రైతులుండగా పీఎం కిసాన్ కింద ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున రూ. 1,62,92000 సాయం అందిందన్నారు. తొలి విడత గత జూన్ 18న పీఎం కిసాన్ సాయం నేరుగా జమ అయినట్లు తెలిపారు.

నూతన మద్యం పాలసీపై అవగాహన

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన నూతన మద్యం పాలసీ విధానంపై అవగాహన అవసరమని మార్కాపురం ఏఈఎస్ దాసరి బాలయ్య అన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గిద్దలూరు ఎక్సైజ్ పరిధిలో నగర పంచాయతీలో 5 దుకాణాలు, గిద్దలూరు రూరల్ పరిధిలో 3, రాచర్ల 2, కొమరోలు 3 దుకాణాలకు టెండర్లను వేయనున్నామన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు డీడీ రూపలంలో చెల్లించి టెండర్లలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. 10వ తేదీన స్క్రూటినీ, 11వ తేదీన కలెక్టర్ సమక్షంలో డ్రా తీయనున్నట్లు పేర్కొన్నారు. 12వ తేదీన దుకాణాలు ప్రారంభిస్తారని చెప్పారు. మద్యం టెండర్లలో పాల్గొనే వ్యాపారులకు పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. ఎటువంటి అనుమానాలు లేకుండా నిర్భయంగా వ్యాపారం కొనసాగించుకోవచ్చన్నారు. వేలం పాటలో మద్యం టెండర్లను దక్కించుకుని మద్యం వ్యాపారాన్ని కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్ ఏఈగా శ్రీనివాసుల రెడ్డి



బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసుల రెడ్డి

కొనకనమిట్ల: మండల పంచాయతీరాజ్ ఏఈగా దండా శ్రీనివాసులరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. తర్లుపాడు మండలంలో పని చేస్తూ బదిలీపై కొనకనమిట్ల మండలానికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన నిరంజన్ వెలిగండ్ల మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మండలంలో రహదారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పొదుపు గ్రూపుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఏపీఎం

కొనకనమిట్ల: గ్రామాల్లో పొదుపు గ్రూపు సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఏపీఎం సుధాకరరావు అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో అన్ని గ్రామాల వీఓఏలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల రికవరీ, సీఎల్ఎఫ్ రుణాల రికవరీల గురించి చర్చించారు. పొదుపు సంఘాలు తీసుకున్న బ్యాంక్ రుణాలను సక్రమంగా కట్టించి తిరిగి వారికి బ్యాంక్ రుణాలు ఇప్పించేందుకు వీఓఏలు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామైక్య సంఘాల సహాయకులకు ఫిజియోథెరపీ గురించి అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే హింస, బాల్య వివాహాలపై పొదుపు సంఘాల సభ్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సీసీలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఇ- కేవైసీ పూర్తి చేయించండి

కొనకనమిట్ల: వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు ఇ- పంట నమోదు చేసుకున్న తదుపరి ఈ నెల 7వ తేదీలోగా ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి అన్నారు. శనివారం పెదారికట్లలో ఖరీఫ్‌లో సాగు చేసిన పలు రకాల పంటలను పరిశీలించడంతో పాటు ఇ- పంట, ఈకేవైసీ నమోదు పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటకు జియో కోఆర్డినేటర్ల వివరాలతో పాటు ఫొటోలు తీసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆర్బీకే సిబ్బంది, రైతులున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



పాత ప్రభుత్వ వైద్యశాల వెనుక ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితి ఇలా..



యర్రబాలెం వెళ్లే మార్గంలో పంట పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- చిల్లచెట్లు, వ్యర్థాలతో మూసుకుపోతున్న ట్రాన్స్‌ఫార్మర్‌లు
- పగటి పూట వెలుగుతున్న వీధి దీపాలు
- కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు
- పట్టించుకోని అధికారులు

కంభం: విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు చిల్ల చెట్లు, తీగచెట్లు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారుతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో రోడ్డు వెంట ఉన్న విద్యుత్ స్తంభాలకు తీగచెట్లు అల్లుకొని తీగలపై వరకు పాకాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా పోల్స్‌కున్న లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. పాత ప్రభుత్వ వైద్యశాల వెనుక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చిల్లచెట్లు, వ్యర్థాలు నిండి అధ్వానంగా మారిపోయింది. చిన్నపాటి వర్షం కురిసినా ఆ ప్రాంతంలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని స్థానికులు వాపోతున్నారు. కంభం చెరువుకు వెళ్లే మార్గంలో, లింగోజిపల్లి, యర్రబాలెం, తురిమెళ్ల మార్గంలో ఉన్న పంట పొలాల్లో విద్యుత్ స్తంభాల ఓ వైపుకు ఒరిగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నారు. చౌక్ సెంటర్, రామాలయం వీధి, జామియా మసీదు సెంటర్‌లో పలుచోట్ల పాత ఇనుప విద్యుత్ స్తంభాలు ఉండటంతో వర్షాలు పడ్డప్పుడు వాటిని ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. ఈ మార్గంలో లారీలు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో, పండగల సమయంలో గ్రామోత్సవాలు నిర్వహించేటప్పుడు విద్యుత్ తీగలు కిందకు ఉండటంతో నానా తంటాలు పడుతున్నారు. గ్రామోత్సవాలు జరిగే సమయంలో అది పూర్తయ్యే వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుంది. లో ఓల్టేజీ సమస్య సైతం పట్టణ ప్రజలను వేధిస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, బడాబాబులకు హుటాహుటిన సేవలందించే విద్యుత్ శాఖాధికారులు సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను, స్తంభాలను మరమ్మతులు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్‌బీఐ సమీపంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు, పగలు వెలుగుతున్న వీధిలైట్లు



కంప్యూటర్ ఆపరేటర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ అమూల్య

లెక్కల మాస్టారుపై ఎంపీపీ ఫైర్

- తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం
- సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులు

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అశ్వనీకుమార్‌పై ఎంపీపీ కామూరి అమూల్య ఫైర్ అయ్యారు. విద్యార్థులకు పాఠాలు సరిగా చెప్పడం లేదని తెలియడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అన్ని శాఖల అధికారులతో సమీక్ష చేశారు. కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గణిత ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే రీతిలో చెప్పడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. మళ్లీ చెప్పాలని అడిగితే కోప్పడుతున్నాడని, విద్యార్థులకు భయాందోళనకు గురవుతున్నారని, వందల మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు నిబద్ధతతో పని చేయాలన్నారు. ఇలా అయితే ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల తల్లిదండ్రులు ఆదరిస్తారా..అని ఎంపీపీ మండపడ్డారు.

సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులు

ప్రతి 3 నెలలకు ఒకసారి మండల అభివృద్ధిపై ఎంపీపీ అధ్యక్షతన జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశానికి పలువురు మండల స్థాయి అధికారులు శనివారం డుమ్మా కొట్టారు. అధికారుల తరఫున అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను పంపించడం ఏమిటని ఎంపీపీ అమూల్య విస్మయం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని వారిలో నీటి పారుదలశాఖ, స్త్రీశిశు సంక్షేమ, విద్యుత్, వెలుగు, ఆర్అండ్‌బీ, హోమియో, ఆయుర్వేద శాఖల నుంచి అధికారులు హాజరు కాలేదు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం రూరల్: ఆటో డ్రైవర్లకు సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై సైదుబాబు శనివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సాక్షి పత్రికలో 'మార్కాపురం స్టేషన్‌లో సమస్యల కూత' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పోలీసు అధికారులు రైల్వేస్టేషన్, గవర్నమెంటు హాస్పిటల్, వేములకోట, చింతగుంట్ల రూట్లలో తిరిగే ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఆటోల్లో ఎక్కిన ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని హెచ్చరించారు. త్వరలో ప్రతి ఆటోకు పోలీసు నంబరు ఇస్తామన్నారు. రాత్రి పూట అధిక ధరలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్సై రత్నం, సీపీఐ నాయకుడు అందె నాసరయ్య, ఆటో యూనియన్ నాయకుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సై సైదుబాబు

విలువలతో కూడిన విద్య అవసరం

మార్కాపురం: ఇంజినీరింగ్ విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు కళాశాల చైర్మన్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, డైరెక్టర్ మసూద్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన అన్నా రాంబాబు మాట్లాడుతూ కళాశాలకు వచ్చే విద్యార్థులు చదువుపైనే దృష్టిసారించి ఎక్కడా ఫెయిల్ కాకుండా చదివితే జీవితంలో స్థిరపడవచ్చన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ తదితర వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. కళాశాల చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీబేగ్ మాట్లాడుతూ కాలేజీకి మంచిపేరును తేవాలని, ఎ1 గ్లోబల్ కళాశాలలో చదివిన వారు దేశవిదేశాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి స్థానాల్లో ఉన్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సీహెచ్ బాలమురళీకృష్ణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ మగ్బుల్ బాషా తదితరులు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, టైం మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, కళాశాల ఫౌండర్ ఉస్మాన్ బేగ్, జాఫర్ బేగ్, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, తర్లుపాడు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఫరతుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాంబాబును సన్మానించారు.



రాంబాబును సన్మానిస్తున్న షంషేర్ అలీబేగ్

పారదర్శకంగా మద్యం టెండర్లు

కంభం: ప్రజలకు ఆరోగ్యకరమైన మద్యాన్ని అందించడం కోసం ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చిందని మార్కాపురం అసిస్టెంట్ ప్రొబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య అన్నారు. శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం మద్యం షాపుల టెండర్లు పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. కంభం పరిధిలో 5 షాపులు, బేస్తవారిపేట పరిధిలో 3 షాపులు, అర్ధవీడు పరిధిలో 2 షాపులకు టెండర్లు వేయవచ్చన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నగదు ఆన్‌లైన్ ద్వారా, బ్యాంకుల నుంచి డీడీల రూపంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాన్ రిఫండబుల్ నగదని, దరఖాస్తు దారులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. చివర్లో ఆన్‌లైన్ సర్వర్ బిజీగా ఉంటుందని దరఖాస్తుదారులు రెండు రోజుల ముందే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి,స్క్వాడ్‌ఇన్‌స్పెక్టర్‌బాషా,తదితరులుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

జగన్మాతా..నమోస్తుతే!



బేస్తవారిపేట: నటరాజేశ్వరీదేవిగా వాసవీమాత



బేస్తవారిపేట: అన్నపూర్ణాదేవిగా చౌడేశ్వరీదేవి



గిద్దలూరు: గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో

కొనకనమిట్ల: దసరా నవరాత్రుల సందర్భంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, కొనకనమిట్ల రామదూతక్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకుని పరవశించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగ.. వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

గిద్దలూరు రూరల్: దసరా శరన్నవరాత్రుల మహోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అద్దాల మండపంలోని ఊయలలో ఉన్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరించారు. కాశినాయన కుంట ఆవరణలోని గాయత్రిమాత ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వీరన్నబావి సమీపంలోని కాళికాంబ ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని కొండ మీద శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, పాతాళనాగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరవ రోడ్డులోని కాశినాయన కుంట కట్ట మీద కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

నటరాజేశ్వరీదేవిగా వాసవీమాత

బేస్తవారిపేట: దసరా శరన్నావరాత్రి ఉత్సవాలు సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని నటరాజేశ్వరీదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో భువనేశ్వరీదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణదేవిగా అలంకరణలు చేశారు. పాపాయిపల్లె, బేస్తవారిపేట పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలతో నిత్యపూజలు, మంగళ హారతి పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకారంలో ముద్దసానమ్మ అమ్మవారు



కొనకనమిట్ల రామ దూతక్షేత్రంలో..



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు



పెదారికట్ల శివాలయంలో..



గొట్లగట్టు రామాలయంలో..

భువనేశ్వరీదేవిగా..

కంభం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు భువనేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక అలంకారంలో ముద్దసానమ్మ

మార్కాపురం రూరల్: మండలంలోని కోలభీమునిపాడు గ్రామ సమీపంలో ఉన్న ముద్దసానమ్మ గ్రామ దేవత ఆలయంలో దసరానవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, మహాలక్ష్మి గణపతి హోమాలను ప్రధాన అర్చకులు ఎస్. చంద్రశేఖర్ శర్మ, శ్రీనివాసశర్మల ఆధ్వర్యంలో జరిగాయి. శనివారం అమ్మవారిని రంగు రంగు గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. టంగుటూరి భాస్కర్‌రావు, గొలమారి వీరారెడ్డి, గార్లపాటి రామకృష్ణారావు, మేడా శ్రీనివాసరావు, పెసల జనార్దన్, సూరె శ్రీకాంత్ తదితరులు పూజలు నిర్వహించారు.

కొనకనమిట్ల: దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని శనివారం మండలంలోని గొట్లగట్టు రామాలయం, పెదారికట్ల రాజనగరేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్ల రామదూత క్షేత్రం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చరణలతో ఉభయదాతలు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పండ్లు, ఫలహారాలను, పసుపు కుంకుమలను సమర్పించి పూజలు నిర్వహించారు. దసరా నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

క్రికెట్ శిక్షణ ఉపయోగించుకోండి

మార్కాపురం: క్రికెట్‌పై ఆసక్తి ఉన్న క్రీడాకారులకు ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు ఉచితంగా క్రికెట్ శిక్షణ ఇస్తామని కోచ్ బాబూరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో మార్కాపురంలోని సబ్ సెంటరులో ఉచిత క్రికెట్ శిక్షణ అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 93477 21839 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సబ్‌కలెక్టర్, డీఎస్పీని కలిసిన న్యాయవాదులు



సబ్‌కలెక్టర్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మార్కాపురం: సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఎస్పీ నాగరాజును శనివారం పట్టణ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అధ్యక్షుడు భూపని కాశయ్య, సెక్రటరీ యద్దనపూడి అనీల్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం



గురుస్వామిని సన్మానిస్తున్న సభ్యులు

పొదిలి: దాసరి గురుస్వామి మూడు సార్లు ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారని వక్తలు కొనియాడారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురుస్వామికి సన్మానం జరిగింది. ప్రస్తుతం కొమరోలు మండలంలోని అల్లినగరం జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. దేవప్రసాద్, హబీబుల్లా కరీముల్లాబేగ్, జి.ఐజాక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ టి.వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం రాత్రి పట్టణంలోని పలు చోట్ల ఆయన ట్రాఫిక్‌లో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

అచ్చిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే అన్నా నివాళి



అచ్చిరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

తర్లుపాడు: గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలగట్ల అచ్చిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు శనివారం నివాళులర్పించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటూ శుక్రవారం రాత్రి అచ్చిరెడ్డి మృతి చెందారు. ఎంపీపీ భూలక్ష్మి, రామసుబ్బారెడ్డి, సర్పంచ్ వరాలు, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ అంకమ్మ, కోఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, జిల్లా జేసీఎస్ కన్వీనరు రామచంద్రారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొలగట్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి



వైద్యశాలలో డానియేల్ మృతదేహం

పొదిలి: ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మార్కాపురం రోడ్డులోని మాదాలవారిపాలెం దగ్గర జరిగింది. ఎస్సై వేమన తెలిపిన వివరాల మేరకు.. కొనకనమిట్ల మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన రమేష్ తన ఆటోలో చౌటపల్లి నుంచి పొదిలికి నలుగురి ఎక్కించుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో మాదాలవారిపాలెం వద్దకు వచ్చే సరికి ముందు టైర్ పంక్చర్ కావటంతో అదుపుతప్పి ఆటో పక్కకు పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న తువ్వపాడుకు చెందిన పందిటి డానియేల్ (60) గాయపడ్డాడు. ముందుగా పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వెళుతుండగా మార్గమధ్యంలో డానియేల్ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పొదిలి వైద్యశాలకు తరలించారు.